క్లుప్తంగా

శ్రీకృష్ణాలయంలో డిప్యూటీ సీఎం ప్రత్యేక పూజలు



డిప్యూటీ సీఎం బూడిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పెందుర్తి: పురుషోత్తపురంలో నూతనంగా నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం ఆలయంలో హోమాలు, ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చందుయాదవ్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు ఆయన్ను సత్కరించారు.

సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు



సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు తరలివచ్చిస్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

ఘనంగా బల్లల పండగ



బల్లల పండగలో పాల్గొన్న భక్తులు

పరవాడ: దేశపాత్రునిపాలెం గ్రామంలో ఉమా లింగేశ్వరస్వామి రజక సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బల్లల పండగను ఘనంగా నిర్వహించారు. బల్లల పండగలో భాగంగా మహిళలు, పిల్లలు, పెద్దలు కలిసి వృత్తి పనిచేసే బల్లల వద్ద దుర్గమ్మకు పసుపు కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సిరందాస నరసింగరావు, ఉమ్మడి జిల్లా రజక సంఘ అధ్యక్షుడు తోకాడ రాము, ఎస్.నూకరాజు, ఎస్.సన్యాసిరావు, ఎం.రామారావు, లక్ష్మి, సంతోషి, దేవి మహిళలు పాల్గొన్నారు.

శుక శ్యామల అలంకరణలో రాజశ్యామల



శుక శ్యామలగా..

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో నిర్వహిస్తున్న శ్యామా నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు మంగళవారం రాజ శ్యామల అమ్మవారు శుక శ్యామల రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. లలిత కళల్లో ప్రావీణ్యం కోరేవారు, అభివృద్ధిని కాంక్షించేవారికి ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకోవడం మంచి ఫలితాలను ఇస్తుందని ప్రతీతి. అనేక మంది భక్తులు ద్విసహస్రలింగ దక్షవాటిలో రుద్రాభిషేకాలు నిర్వహించారు. శ్రీమేరులో సహస్ర నామ కుంకుమార్చనలు, క్షీరాభిషేకాలు చేశారు. గురుమాత శ్రీమతి అన్నపూర్ణమ్మ భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రేపు జిల్లా స్థాయి సైన్సు ఫెయిర్

విశాఖ విద్య: జిల్లా స్థాయి సైన్సు ఫెయిర్ ఈ నెల 15న నిర్వహించనున్నట్టు జిల్లా సైన్సు అధికారి కె. ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గాజువాక కణితి రోడ్‌లోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వేదికగా నిర్వహిస్తున్న ప్రదర్శనకు జిల్లాలో 65 ప్రాజెక్టులు ఎంపికైనట్టు పేర్కొన్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులతో విద్యార్థులు, సైన్సు ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని ఆయన సూచించారు. జిల్లా స్థాయిలో ఉత్తమంగా నిలిచిన ఏడు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ఆహ్లాదం.. ఆనందం

ఇది కదా అభివృద్ధి

- ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న రత్నగిరినగర్ స్పోర్ట్స్ థీమ్ పార్కు
- రూ.1.94 కోట్లతో పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

నాడు: టీడీపీ ప్రభుత్వ హయాంలో రత్నగిరినగర్ పార్కు పిచ్చి తుప్పలు..డొంకలతో నిండిన ఓ ఖాళీ స్థలం. ఆ పార్కు వల్ల ఆహ్లాదం పక్కన పెడితే.. తుప్పల్లో నుంచి ఏ పాము వస్తుందో అని భయాందోళనకు గురయ్యే పరిస్థితి అక్కడి ప్రజలది. ఎన్నోసార్లు అప్పటి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి పార్కు అభివృద్ధి చేయాలని విన్నవించినా ఫలితం శూన్యం.

నేడు: జీవీఎంసీ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఏకైక స్పోర్ట్స్ థీమ్ పార్కు. ప్రధాన నగరాన్ని కాదని విలీన ప్రాంతానికి వన్నె తెచ్చేలా రత్నగిరి నగర్ పార్కును అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కార్పొరేటర్ ముమ్మన దేముడు కృషితో జీవీఎంసీ సారథ్యంలో రూపుదిద్దుకుంటున్న సుందరమైన పార్కు ప్రారంభోత్సవానికి శరవేగంగా ముస్తాబవుతోంది.



ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న రత్నగిరినగర్ స్పోర్ట్స్ థీమ్ పార్కు

పెందుర్తి: ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం ఆ దిశగా జీవీఎంసీ విలీన కాలనీల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రజల ఆసక్తిని, అవసరాన్ని గుర్తించి కాలనీల్లో పార్కులను జీవీఎంసీ అధికారులు ఎంపిక చేసుకున్నారు. ఈ క్రమంలో జీవీఎంసీ 95వ వార్డు రత్నగిరినగర్ పార్కుకు మహర్దశ పట్టింది. ఈ పార్కును అభివృద్ధి చేసే బాధ్యతను ప్రభుత్వం జీవీఎంసీకి అప్పగించింది. పార్కు స్థలాన్ని పరిశీలించిన జీవీఎంసీ ఉన్నతాధికారులు దీన్ని స్పోర్ట్స్ థీమ్ పార్కుగా తీర్చిదిద్దేందుకు సన్నద్ధమయ్యారు. పార్కు అభివృద్ధి కోసం రూ.1.94 కోట్లు విడుదల చేశారు. శరవేగంగా పనులు చేపట్టిన యంత్రాంగం పార్కులో స్పోర్ట్స్ పరికరాలను అమర్చే పనిలో నిమగ్నమైంది. ఈ పార్కులో క్రికెట్ నెట్, వాలీబాల్, రన్నింగ్ ట్రాక్, షటిల్ కోర్టుతో పాటు ఇతరాత్ర అన్ని రకాల ఆటలు ఆడుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెలాఖరుకు పార్కును ప్రారంభిస్తామని ఇటీవలే జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ప్రకటించారు.



నాడు : తుప్పలతో రత్నగిరినగర్ పార్కు

నేడు : రత్నగిరినగర్ స్పోర్ట్స్ థీమ్ పార్కులో ఏర్పాటు చేసిన పరికరాలు



పార్కులో ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు

ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం



మా ప్రాంతంలో పార్కు గతంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. పిచ్చి తుప్పలతో నిండి ఉండడంతో దాని సమీపంలోని వెళ్లాలంటేనే భయంగా ఉండేది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మా పార్కును అభివృద్ధి చేసింది. ప్రారంభోత్సవం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం.

– దొడ్డి పద్మ, రత్నగిరినగర్

ప్రజల ఆరోగ్యంపై దృష్టి



మా ప్రాంతంలోని ఖాళీ స్థలంలో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయడంతో కాలనీలోని యువకులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇన్నాళ్లు వ్యాయామం కోసం ప్రైవేటు జిమ్‌లకు వెళ్లే పరిస్థితి ఉండేది. తాజాగా అభివృద్ధి చేసిన ఈ స్పోర్ట్స్ థీమ్ పార్కు అందుబాటులోకి వస్తే ప్రతీ ఒక్కరూ వినియోగించుకుని ఆటల్లో ప్రావీణ్యంతో పాటు ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునే అవకాశం ఉంది. ప్రజారోగ్యం విషయంలో ప్రభుత్వం చాలా మంచి నిర్ణయాలు తీసుకుంటుంది.

– పి.వి.రమణ,

సర్వత్రా హర్షం



రత్నగిరినగర్ స్పోర్ట్స్ థీమ్ పార్కు నిర్మాణానికి నిధులు విడుదలకు ఆదేశాలు జారీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. పార్కు నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మేయర్ హరివెంకటకుమారికి ధన్యవాదాలు. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం చాలా కీలకమైన నిర్ణయాలు తీసుకుంటుంది. మా వార్డులో నగరంలో ఎక్కడా లేనివిధంగా స్పోర్ట్స్ థీమ్ పార్కు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. ప్రజల నుంచి సర్వాత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

– ముమ్మన దేముడు, కార్పొరేటర్ 95వ వార్డు.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై అధిష్ఠింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేసి హారతులు అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు చక్రవర్తి ఈ సేవ నిర్వహించారు.

అప్పన్నను దర్శించుకున్న మంత్రి రోజా



మంత్రి రోజాకు అప్పన్న చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె. రోజా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆమె పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరం పూజ చేసి గోదాదేవి సన్నిధిలో హారతి ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆమె వెంట ఉన్నారు.

నాసా పోటీలకు రవీంద్రభారతి విద్యార్థులు

పెందుర్తి: నేషనల్ ఏరోనాటిక్స్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్(నాసా) 2024 పోటీలకు సుజాతనగర్ రవీంద్ర భారతి విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాలలో జరిగిన ఎంపికైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. ఈ సందర్భంగా పాఠశాల జీఎం కె.రమ్య మాట్లాడుతూ 15 ఏళ్లుగా రవీంద్రభారతి నుంచి విద్యార్థులు నాసా పోటీలకు ఎంపికవుతున్నారన్నారు. ఈ ఏడాది మే నెల 23 నుంచి 26 వరకు అమెరికా లాస్ ఏంజెల్స్‌లో జరగనున్న నాసా పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు.



నాసా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో జీఎం రమ్య

కాంగ్రెస్‌కు పూర్వ వైభవానికి కృషి

పెందుర్తి: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చే బాధ్యత నాయకులు తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ సూచించారు. సుజాతనగర్‌లోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఠాగూర్ మాట్లాడుతూ పార్టీ కోసం అందరూ అహర్నిశలు పనిచేయాలని ఆదేశించారు. పలు అంశాలపై చర్చించారు. ఏఐసీసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, పార్టీ నేతలు రాకేష్‌రెడ్డి, కొప్పుల రాజు, మాయప్పన్, స్థానిక నాయకుడు వేగి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాణిక్యం ఠాగూర్

రాంనగర్‌లో లేపాక్షి ఎంపోరియం ప్రారంభం

దాబాగార్డెన్స్: రాంనగర్‌లో లేపాక్షి ఎంపోరియం రెండో షోరూం, ఆప్కో మంగళవారం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అఖిల భారత వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి కొత్త స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో విశాఖపట్నంలో లేపాక్షి రెండో షోరూం ప్రారంభించామన్నారు. ఎంపోరియం ఏర్పాటుకు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున కృషి చేశారన్నారు. విశాఖ వాసులు లేపాక్షి ఎంపోరియంలో చేతి వృత్తి కళాకారులు తయారు చేసిన వస్తువులు, చీరలు, వస్త్రాలు కొనుగోలు చేసి, హస్తకళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. త్వరలోనే వైఎస్సార్ జిల్లా గండికోటలో నూతన లేపాక్షి ఎంపోరియం ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ప్రతీ జిల్లా ప్రధాన కేంద్రంలో వైఎస్సార్ చేతివృత్తుల బజార్ల ఏర్పాటుకు సంబంధించిన ఫైల్ ముఖ్యమంత్రికి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో లేపాక్షి మేనేజర్ కార్తీక్, ఆప్కో సిబ్బంది పాల్గొన్నారు.



షోరూంను తిలకిస్తున్న ఏపీహెచ్‌డీసీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

లలితా పీఠంలో ప్రత్యేక పూజలు

ఏయూక్యాంపస్ : శ్రీలలితా పీఠం వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 14వ తేదీన శ్రీపంచమిని పురస్కరించుకుని శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవికి అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహిస్తున్నారు. కలశస్థాపన, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రపాశుపత హోమం భక్తుల గోత్రనామాలతో నిర్వహించారు. మంగళవారం ఉదయం చండీహోమం, శ్రీ చక్రావరణార్చనతో పూజలు జరిపారు. అష్టోత్తర శత కలశాభిషేకం బుధవారం ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తామని ఆలయ ప్రధాన పురోహితులు కాండూరి లక్ష్మణస్వామి తెలిపారు. అదే విధంగా మార్చి 8వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా సాయంత్రం 7 గంటలకు శ్రీ లలితా సుందరేశ్వరుల దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. స్థానిక పెదవాల్తేరులోని వేంకటేశ్వరస్వామి ఆలయ సముదాయంలో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి, పంచముఖ ఆంజనేయునికి మంగళవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మాఘమాసం సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామికి ప్రతిరోజు ఉదయం ప్రత్యేక పంచామృతాభిషేకాలు నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అభిషేకాలు, పూజలు జరిపించారు. రథసప్తమి రోజు సూర్యనారాయణ స్వామికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారు.



లలితా పీఠంలో పూజలు చేస్తున్న భక్తులు

కనకమహాలక్ష్మి ఆలయంలో అక్షరాభ్యాసాలు నేడు

దాబాగార్డెన్స్: వసంత పంచమిని పురస్కరించుకుని నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో చిన్నారులకు బుధవారం అక్షరాభ్యాసాలు చేయించనున్నట్లు ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పాల్గొనదలిచే చిన్నారుల తల్లిదండ్రులు రూ.200 రుసుం చెల్లించాలని తెలియజేశారు. పూజకు కావల్సిన సామగ్రిని భక్తులే తెచ్చుకోవాలని చెప్పారు. చిన్నారులకు పలక, పెన్ను, పుస్తకాన్ని దేవస్థానమే ఉచితంగా అందజేయనుందని వివరించారు.

శ్రీరాముడి హృదయానంద స్వరూపం 'హనుమంతుడు'



ప్రవచనాలు చెబుతున్న షణ్ముఖ శర్మ



హనుమత్ వ్రతంలో పాల్గొన్న భక్తులు

ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖ శర్మ

ఎంవీపీ కాలనీ: శ్రీరాముడి హృదయానంద స్వరూపం హనుమంతుడు అని ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. హనుమద్వైభవ ప్రవచనాలు ఎంవీపీ కాలనీలో మంగళవారం కొనసాగాయి. ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా షణ్ముఖ శర్మ హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో హనుమద్వైభవ ప్రవచనాలు కొన్ని రోజులుగా కేవీఎస్ శ్యామ్, అరుణ గాయత్రి దంపతుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా షణ్ముఖశర్మ మాట్లాడుతూ మనోనిబ్బరానికి నిలువెత్తు నిదర్శనంగా, వేదాంత విద్యను ఎరిగిన వాడిగా, జ్ఞానంతో ఉన్నత విలువలు కలిగిన వాడిగా హనుమాన్ ప్రసిద్ధి చెందాడన్నారు. రాగ, ద్వేషాలకు అతీతంగా కర్తవ్యాన్ని ఆచరించగల సమర్థత ఆయన సొంతమన్నారు. శ్రీరాముడి కార్యాచరణలో హనుమంతుని పాత్ర ప్రత్యేకమన్నారు. ప్రపంచంలోని అరుదైన అద్భుత ఔషధాలు ఆయుర్వేదం రూపంలో మన దేశంలో ఉన్నాయన్నారు. సంజీవని పర్వతాన్ని తెచ్చి లక్ష్మణుడికి ప్రాణదానం చేసిన కర్త వ్యసాధకునిగా హనుమంతుడు నిలిచారన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన హనుమత్ వ్రతంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రవచనాలు అనంతరం భక్తులు షణ్ముఖ శర్మ ఆశీస్సులు తీసుకున్నారు.

'ఇన్‌స్పైర్ మనక్'లో 200 ప్రాజెక్టుల ఎంపిక

విశాఖ విద్య: ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో 200 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒక్కో విద్యార్థి రూ.10 వేలు ప్రోత్సాహకం అందుకోనున్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను జిల్లాల వారీగా సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నగదు ప్రోత్సాహకం అందించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సామాజిక అంశాలే ప్రధానం : మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఏటా పాఠశాల స్థాయిలో 'ఇన్‌స్పైర్ మనక్' పేరిట విద్యార్థుల్లో సృజనాత్మకతపై పోటీలను నిర్వహిస్తోంది. సామాజిక అంశాలు, సమాజాభివృద్ధికి దోహదపడే వినూత్నమైన ఆలోచనలకు రూపం ఇచ్చేలా ఎలాంటి ప్రాజెక్టులను తయారు చేస్తామనే అంశంపై విద్యార్థులు తమ ఐడియాను నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 2023–24 విద్యా సంవత్సరానికి 2,680 మంది పేర్లు నమోదు చేసుకోగా, ఇందులో 200 మంది ఎంపికయ్యారు. విద్యార్థులు తమకు అందిన రూ.10 వేల నగదు ప్రోత్సాహకాన్ని వినియోగించుకుని, ప్రాజెక్టుకు అవసరమయ్యే సామగ్రిని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థుల పేర్లతో బ్యాంక్ అకౌంట్ తెరవాలని సూచించారు. దీనిపై ఆయా పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

మానవ తప్పిదాలతోనే విపత్తులు

ఏయూ క్యాంపస్ : విపత్తులకు మానవ తప్పిదాలు కూడా కారణమేనని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. ఏయూలోని మదన్ మోహన్ మాలవ్య టీచర్స్ శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న రీఫ్రెషర్ కోర్సును మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భౌగోళిక విపత్తులు, వాటి నుంచి రక్షణలో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్‌ల పాత్ర వివరించారు. ముఖ్యంగా అడవుల నరికివేత, నగర జనాభావృద్ధి, పారిశ్రామిక అభివృద్ధి వంటివి పెను సవాళ్లుగా మారుతున్నాయన్నారు. తుఫానులు, భూకంపాలు, సునామీ వంటివి ప్రజల జీవనాన్ని నియంత్రిస్తున్న విధానాన్ని వివరించారు. కేంద్రం సంచాలకులు ఆచార్య టి.వి.కృష్ణ మాట్లాడుతూ రెండు వారాల శిక్షణలో భాగంగా అందించే నిపుణుల ప్రసంగాల వివరాలు, ప్రాధాన్యత తెలియజేశారు. కోర్సు సమన్వయకర్త ఆచార్య సి.వి. నాయుడు మాట్లాడుతూ భౌగోళిక విపత్తులు, వాటి నిర్వహణను వివరించారు. అధ్యాపకులు విపత్తుల నిర్వహణలో వలంటీర్లుగా మారాల్సిన ఆవశ్యకత, విద్యార్థులకు వీటిపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. శిక్షణ కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న రెక్టార్ ఆచార్య సమత